


## క్రిస్మస్ శుభాకాంక్షలు

పాఠకులకు, ప్రకటనకర్తలకు, వ్యాపార వాణిజ్యవేత్తలకు, క్రిస్టియన్ సోదర సోదరీమణులకు క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు. క్రిస్మస్ పండుగ సందర్భంగా గురువారం రోజున కార్యాలయానికి సెలవు. కావున సంచిక వెలువడదు. పున: దర్శనం శుక్రవారం.

ఇట్లు : మేనేజ్ మెంట్,
- వరంగల్ వాయిస్ దినపత్రిక

# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 020
పేజీలు : 08 | వెల: రూ.5/-

బుధవారం
డిసెంబర్ 24, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




# హద్దుమీరితే హ్యాపీ ఉండదు !

న్యూ ఇయర్ వేడుకల పేరిట హద్దు మీరితే మీ జీవితంలో 'హ్యాపీ' ఉండదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జైలు ఖాయమంటున్నారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రమాదాల నివారణకు పోలీసులు కఠిన నిబంధనలు అమలు చేయనున్నారు. వేడుకల పేరుతో ఎవరైనా హద్దు మీరి నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు గట్టిగా హెచ్చరించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడాన్ని అరికట్టేందుకు విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పౌరులు బాధ్యతాయుతంగా వేడుకలు జరుపుకోవాలని, మద్యం సేవించిన వారు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం శిక్ష తప్పదని అధికారులు తెలిపారు. అందులో భాగంగానే పోలీసు శాఖ ప్రత్యేక ప్రణాళికతో రంగంలోకి దిగినట్లు సమాచారం. అయితే నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు వైన్స్ షాపులకు, తెల్లవారుజామున 1 గంటల వరకు బార్లకు తెలంగాణ ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. డిసెంబర్ 31వ తేదీ రాత్రి, జనవరి 1వ తేదీ తెల్లవారుజామున నిర్వహించే వేడుకల కోసం ఇప్పటికే పలు ఆంక్షలు విధించారు. మద్యం విక్రయాలు, సేవపై దృష్టి సారించిన పోలీసులు.. ప్రత్యేకంగా టైమింగ్స్ పాటించాలంటున్నారు.

– వరంగల్ వాయిస్ ప్రతినిధి

- న్యూ ఇయర్ పేరిట నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- వైన్స్ కు అర్ధరాత్రి 12, బార్ లకు 1 గంట వరకు అనుమతి
- విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు
- శాంతిభద్రతల పరిరక్షణకు కఠిన నిబంధనలు
- రాష్ట్ర పోలీసుల హెచ్చరిక





## సమన్వయంతో పనిచేద్దాం..

- జాతరను విజయవంతం చేద్దాం
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

2లో..

## భద్రకాళి అమ్మవారికి పెద్ద రథం

- స్థపతి వల్లినాయగంతో చర్చ
- త్వరలో ప్లాన్, ఎస్టిమేట్ల తయారీ



2లో..

## ఆలయాల జోలికొస్తే ఉరికించి కొట్టుడే..

- కార్పొరేషన్ అధికారులకు గుడి అనే సోయి లేదా
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



8లో..



# సమన్వయంతో పనిచేద్దాం..

- **జాతరను విజయవంతం చేద్దాం**
- **వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్ వాయిస్, క్రైం :** పోలీస్ అధికారులు సమన్వయంతో పని చేసి మేడారం శ్రీ సమ్మక్క – సారలమ్మ జాతరను విజయవంతం చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులకు సూచించారు. జనవరి చివరి వారంలో ప్రారంభమయ్యే మేడారం జాతర బందోబస్తులో భాగంగా వరంగల్ సీపీకి ట్రాఫిక్ బందోబస్త్ బాధ్యతలు అప్పగించారు. దీంతో కమిషనరేట్ కు చెందిన డీసీపీ, అదనపు డీసీపీ, ఏసీపీలతో కలిసి బుధవారం హనుమకొండ జిల్లా కేంద్రం నుంచి జాతర నిర్వహించే ప్రదేశం వరకు ప్రధాన రోడ్డు మార్గాన్ని సీపీ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ మార్గంలో వాహన పార్కింగ్, హోల్డింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తే ప్రదేశాల్లో బందోబస్తుపై సీపీ క్షేత్ర స్థాయిలో సమీక్షా జరిపారు. అనంతరం సీపీ గట్టమ్మ గుట్ట వద్ద ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల పార్కింగ్ ప్రదేశాలతో పాటు, మేడారం జాతర ప్రదేశానికి చేరుకునే మార్గాలపై వివరాలు సేకరించారు. అనుకోని పరిస్థితిలో ట్రాఫిక్ సమస్య ఏర్పడితే ప్రత్యామ్నాయ మార్గాలపై కూడా సీపీ సంబంధిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మేడారం చేరుకున్న సీపీ సన్ ప్రీత్ సింగ్ పోలీస్ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం మేడారం సమ్మక్క – సారలమ్మ లను ఆయన దర్శించుకొని మొక్కులను చెల్లించుకున్నారు. సీపీ వెంట ములుగు ఎస్పీ సుధీర్ కేకన్, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ములుగు ఓఎస్ డీ శివం ఉపాధ్యాయ, అదనపు డీసీపీ ప్రభాకర్, ఏసీపీలు జితేందర్ రెడ్డి, సత్యనారాయణ, సతీష్ బాబు, ములుగు డీఎస్పీ రవీందర్ తో ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# భద్రకాళి అమ్మవారికి పెద్ద రథం

- **స్థపతి వల్లినాయగంతో చర్చ**
- **త్వరలో ప్లాన్, ఎస్టిమేట్ల తయారీ**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న మాడవీధుల్లో శ్రీ భద్రకాళి అమ్మవారి ఊరేగింపు నిమిత్తం ఒక పెద్ద రథం తయారు చేయించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశానుసారం బుధవారం ఆలయ ప్రాంగణంలోని కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ స్థపతి వల్లినాయగం నేతృత్వంలో దేవాలయ చైర్మన్, ధర్మకర్తల మండలి, కార్యనిర్వహణాధికారి, అర్చకులతో సమావేశం ఏర్పాటు చేసి రథమునకు సంబంధించిన నమూనాలను పరిశీలించారు. భవిష్యత్ అవసరాలు, భక్తుల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని రథం ఎత్తు 30 ఫీట్లు, 40 ఫీట్లు, 50 ఫీట్లలో ఏది ఉపయోగకరంగా ఉంటుందన్న దానిపై చర్చించారు. ఈ మేరకు స్థపతి వల్లినాయగంకు పలువురు తమ సూచనలు, సలహాలను అందజేశారు. వీటికి సంబంధించిన ప్లాన్లు, ఎస్టిమేట్లు త్వరలోనే తయారు చేసి ఇవ్వగలనని వల్లి నాయగం తెలిపారు. ప్లాను, ఎస్టిమేషన్ అందిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన ఒక సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆలయ చైర్మన్, ధర్మకర్తల మండలి తెలిపింది. ఈ సందర్భంగా స్థపతి వల్లి నాయగంను చైర్మన్, ధర్మకర్తల మండలి దుశ్శాలువతో సత్కరించి అమ్మవారి ప్రసాదములు అందజేశారు. ఈ సమావేశంలో చైర్మన్ డాక్టర్ బి.శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, కటకం రాములు, ఓరుగంటి పూర్ణచందర్, మోతుకూరి మయూరి రామేశ్వరావు, అనంతుల శ్రీనివాస్, ఈఓ రామల సునీత, భద్రకాళి శేషు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.





# రిజర్వ్ ఇన్ స్పెక్టర్ ను పరామర్శించిన ఎస్పీ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇటీవల ఖమ్మం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన బండి హర్షిత్ గౌడ్ కుటుంబాన్ని భూపాలపల్లి ఎస్పీ సంకీర్త్ బుధవారం హనుమకొండ గోపాలపూర్ లో పరామర్శించారు. హర్షిత్ గౌడ్ తండ్రి బండి పూర్ణచందర్ గౌడ్ పోలీస్ రిజర్వు ఇన్ స్పెక్టర్ గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా పూర్ణచందర్ ను ఎస్పీ సంకీర్త్ ఓదార్చారు. పరామర్శించిన వారిలో భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ నరేశ్ కుమార్, గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి నర్సింగ గౌడ్ తదితరులు ఉన్నారు.

# సృష్టి తరహాలో మరో మోసం

- **పిల్లలను విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టు**
- **12మంది ముఠా సభ్యుల అరెస్ట్**

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తాజాగా భాగ్యనగరంలో మరో సృష్టి కేసు వెలుగులోకి వచ్చింది. పసి పిల్లలను అమ్ముతున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. పిల్లల విక్రయానికి లక్షల్లో లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. గతంలో సరోగసి పేరుతో దంపతుల నుంచి లక్షల్లో వసూలు చేసి, పిల్లలను అక్రమంగా విక్రయించిన సృష్టి కేసు రాష్ట్రంలో ఎంతటి సంచలనాన్ని సృష్టించిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు అదే తరహాలో పసిపిల్లలను తెచ్చి అంటగట్టడం ద్వారా లక్షల్లో దోచుకున్న ముఠా గుట్టురట్టయ్యింది. దాదాపు 12 మంది ముఠా సభ్యులను అరెస్ట్ చేసిన పోలీసులు.. వారి బారి నుంచి పిల్లలను రక్షించారు. ఈ ముఠా నుంచి ఇద్దరు బాలలను ఎస్వోటీ పోలీసులు కాపాడారు. అంతే కాకుండా ఒక్కొక్క శిశువు అమ్మకం వెనకాల 15 లక్షల రూపాయల లావాదేవీలు జరిగినట్లు పోలీసుల విచారణలో బయటపడింది.

# మద్ది మేడారం జాతరకు సమగ్ర ఏర్పాట్లు





□ **సమీక్షించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ వాయిస్, నల్లబెల్లి :** నల్లబెల్లి మండలంలోని మద్ది మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర జనవరి 28, 29, 30 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో అక్కడి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాతరను సజావుగా నిర్వహించేందుకు అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా రోడ్ల అభివృద్ధి, లైటింగ్ ఏర్పాటు, ఆలయ పరిసరాల కలరింగ్ పనులు, అత్యవసర సేవల కోసం మెడికల్ క్యాంపుల ఏర్పాటు, భక్తులకు అవసరమైన తాగునీటి వసతులు, వాహన రద్దీని నియంత్రించేందుకు పార్కింగ్ స్థలాల కేటాయింపు వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులతో విస్తృతంగా చర్చించారు. అలాగే మద్ది మేడారం ప్రధాన పూజారి దురిశెట్టి నాగరాజుతో మాట్లాడి జాతర నిర్వహణకు కావలసిన అవసరాలను తెలుసుకున్నారు. గత జాతరలో చేసిన ఏర్పాటును పరిశీలించి, ఈ జాతరకు చేసే ఏర్పాట్ల నివేదికలు సమర్పించాలని నల్లబెల్లి తహసిల్దార్ ను కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో భక్తులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన జాతర నిర్వహణ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ అధికారి ఇజ్జగిరి, నాగరాజుపల్లి సర్పంచ్ ఎరుకలి లలిత, నల్లబెల్లి తహసీల్దార్ ముప్పు కృష్ణ, ఎంపీడీవో శుభం నివాస్, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్ ఏర్పాటుకు స్థల పరిశీలన..

జనవరి 28 నుండి 31 వరకు ములుగు జిల్లా మేడారంలో నిర్వహించనున్న శ్రీ సమ్మక్క సాలమ్మ జాతర నేపథ్యంలో జిల్లాలో భక్తుల సౌకర్యార్థం పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో నిర్వహించిన సమావేశంలో మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర, నల్లబెల్లి మద్ది మేడారం జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ముందస్తు ప్రణాళికతో సమర్ధవంతంగా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. గత మేడారం అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం మేడారం జాతర సందర్భంగా భక్తుల రాకపోకలకు అనువుగా తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు కోసం క్షేత్ర స్థాయిలో స్థల పరిశీలన చేశారు. బస్టాండ్ ఏర్పాటుకు అనువైన లక్ష్మీపురం పరిధిలోని ఎస్ఎన్ఎం క్లబ్, ఓ సిటీ గ్రౌండ్‌లను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా ఆర్ అండ్ బి అధికారి రాజేందర్, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, ఆర్ డబ్ల్యూఎస్ ఈఈ సునీత, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి ఇజ్జగిరి, ఆర్డీఓ సుమా, డీపీఓ కల్పన, జిల్లా ఫైర్ అధికారి రెడ్డి, ఆర్టీసీ డీఎం ధరమ్ సింగ్, కుడా పీఓ అజిత్ రెడ్డి, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వినియోగదారుల చైతన్యంతోనే మోసాలకు అడ్డుకట్ట

◆ కోడిమాల శ్రీనివాసరావు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉన్నప్పుడే ఉత్పత్తిదారులు, విక్రేతల మోసాల నుంచి రక్షించబడతారని కాలేజ్ కన్జ్యూమర్ క్లబ్స్ కోఆర్డినేటర్, ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి కోడిమాల శ్రీనివాసరావు అన్నారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం వినియోగదారుల హక్కులు, పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. "వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం–2019" సామాన్యుల చేతిలో ఒక బ్రహ్మాస్త్రం వంటిదని పేర్కొన్నారు. ముఖ్యంగా నాణ్యత, తూనికలు, కల్తీ పదార్థాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు కచ్చితంగా కింది లోగోలను గమనించాలని సూచించారు. బంగారం హాల్‌మార్క్, ఆహార పదార్థాలు అగ్‌మార్క్ (AGMARK), FSSAI, సిల్క్ వస్త్రాలు: సిల్క్ మార్క్, ఎలక్ట్రానిక్స్ (ఫ్రిజ్, ఏసీ): ఎకో మార్క్, ఇతర వస్తువులు ఐఎస్ఐ మార్క్ లు గమనించాలని తెలిపారు. ఫిర్యాదుల కోసం 1915 టోల్ ఫ్రీ నంబర్: ప్రతి వస్తువుకు రసీదు పొందడం తప్పనిసరి అని, నాణ్యత లోపిస్తే లేదా తూకంలో తేడా ఉంటే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఫిర్యాదుల కోసం 1915 టోల్ ఫ్రీ నంబర్‌ను లేదా ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కోడిమాల శ్రీనివాసరావు రూపొందించిన అవగాహన గోడ పత్రికను అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆవిష్కరించారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ పోటీల్లో విజేతలకు ఆమె ప్రశంసా పత్రాలు, పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్ కృష్ణయ్య, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, లీగల్ మెట్రాలజీ అధికారులు, క్యాట్కో రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ లాల్ చౌరాసియా, సుదర్శన్ గౌడ్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# నట్టల నివారణకు మందులు తప్పనిసరి

■ పశువైద్యాధికారి నాగేశ్వరరావు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** గొర్రెలు, మేకల ఆరోగ్య సంరక్షణలో భాగంగా యజమానులు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులను వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ నాగేశ్వరరావు సూచించారు. బుధవారం మండలంలోని జోగ్య తండ, బొడ్రాయి తండ, పెరుమాండ్ల సంకీసా గ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో ఈ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జోగ్య తండ సర్పంచ్ చందవత్ రమేశ్, బొడ్రాయి తండ సర్పంచ్ శ్రీమతి తేజవత్ సంపూర్ణ దేవ, సంకీసా సర్పంచ్ జీడి మధుల సమక్షంలో గొర్రెల కాపరులకు మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ పశువుల పెంపకందారులకు పలు సూచనలు చేశారు. నట్టల వల్ల పశువులలో రక్తహీనత ఏర్పడి, అవి బలహీనపడతాయి. దీనివల్ల ఎదుగుదల లోపించి, త్వరగా రోగాల బారిన పడి మరణించే ప్రమాదం ఉంది. ప్రతి 3–4 నెలలకు ఒకసారి తప్పనిసరిగా నట్టల నివారణ మందులు తాగించాలి. మందులు తాగించిన తర్వాత పశువుల శక్తి కోసం లివర్ టానిక్ లు, కాల్షియం టానిక్ లు వాడటం మంచిదని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచులు మామిల్ల రవి, తేజవత్ జమ్లు, రైతు నాయకులు వేల్పుల వెంకన్న, నాయని రాజు, అప్పయ్య, జంగాల యాదయ్య, నర్సయ్య, తేజవత్ రామ్మూర్తి, కేతు రెక్య, వంకుదోత్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికులకు క్రిస్మస్ కానుక



**వరంగల్ వాయిస్, వరంగల్:** క్రిస్మస్ పండుగ సందర్భంగా 24వ డివిజన్ పరిధిలోని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బందికి స్థానిక కార్పొరేటర్ ఆకుతోట తేజశ్రీ శిరీష్ ఘనంగా సత్కరించి, పండుగ కానుకలను అందజేశారు. బుధవారం కార్పొరేటర్ నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ పసునూరి దయాకర్, కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజు, సీఎంహెచ్ఓ రాజి రెడ్డి హాజరయ్యారు. నగర పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల సేవలను వారు ఈ సందర్భంగా కొనియాడారు. వారి ముఖాల్లో చిరునవ్వు చూడటమే పండుగ అసలైన పరమార్థమని వారు పేర్కొన్నారు. కార్పొరేటర్ ఆకుతోట తేజశ్రీ స్వయంగా పారిశుధ్య సిబ్బందికి చీరలు, డ్రస్సులను పంపిణీ చేశారు. డివిజన్ అభివృద్ధిలో పారిశుధ్య కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని, అందుకే పండుగ వేళ వారికి చిన్న కానుకను అందజేస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సకినాల రజనీకాంత్, మబ్బు ప్రవీణ్, కిరణ్, సురేష్, ఆరిఫ్ తదితర నాయకులతో పాటు, శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోల్కొండ శ్రీనివాస్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# ముదిరాజ్ సర్పంచులు, వార్డు సభ్యులకు సన్మానం



**వరంగల్ వాయిస్, గణపురం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల పరిధిలో నూతనంగా ఎన్నికైన ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన సర్పంచులను, వార్డు సభ్యులను బుధవారం ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షుడు బోయిని సాంబయ్య ముదిరాజ్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. కొండాపురం గ్రామ సర్పంచ్ మద్దెల విజయ అశోక్, వెంకటేశ్వర్లపల్లి సర్పంచ్ ముప్పిడి నాగరాజులతో పాటు నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులను శాలువాలు, పూలమాలలతో గౌరవించారు. ఈ కార్యక్రమానికి ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు చాడ కిష్టాస్వామి ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సామాజిక వర్గ ప్రతినిధులు ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కావడం గర్వకారణమని, గ్రామాల అభివృద్ధిలో వారు కీలక పాత్ర పోషించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ కార్యదర్శి కొంతం గణపతి, డైరెక్టర్ గూల్లా రాజకుమార్, మునిగాల రమేష్, సోషల్ మీడియా జిల్లా ఇంచార్జి జోడు ప్రదీప్, నాయకులు గంగారావేణి నరేందర్, తీగల శ్రీకాంత్, కీర్తి రాజు, అచ్చునూరి సంపత్, బొల్లా గణేష్, చాగర్తి శ్రీనివాస్, దయాకర్, మేడి చందు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి సహకరించండి

## అధికారులకు గణపురం సర్పంచ్ విజ్ఞప్తి



**వరంగల్ వాయిస్, గణపురం :** గణపురం మేజర్ గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్ కట్కూరి రాధికా శ్రీనివాస్ బుధవారం మండలంలోని పలువురు ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మధురకవి సత్యనారాయణ స్వామి, ఎస్ఐ రేఖ అశోక్, రెండో ఎస్ఐ గైకవాడ్ అమూల్యలను వారు కలిసి, పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. సన్మానం అనంతరం సర్పంచ్ రాధికా శ్రీనివాస్ దంపతులు అధికారులతో గ్రామ సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణపురం అభివృద్ధికి రెవెన్యూ మరియు పోలీస్ శాఖల నుంచి పూర్తి సహకారం అందించాలని కోరారు. అందరం కలిసికట్టుగా పనిచేసి గణపురాన్ని ఒక ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించడంలో అధికారుల తోడ్పాటు ఎంతో అవసరమని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పంచాయతీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, గణపురం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బస్వరాజ్ పల్లె గ్రామానికి చెందిన బూడిద స్వామి ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి బుధవారం బాధిత కుటుంబాన్ని సందర్శించి వారిని పరామర్శించారు. స్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, కీర్తి రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ పరామర్శలో కీర్తి రెడ్డి వెంట కుక్కముడి రమేష్ (వార్డు మెంబర్), మిట్ట కుమారస్వామి (జిల్లా కౌన్సిల్ మెంబర్), సైండ్ల తిరుపతి (బూత్ అధ్యక్షులు), ఎర్ర రాకేష్ రెడ్డి (సోషల్ మీడియా కన్వీనర్), పార్టీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# రోడ్డు పనులకు శ్రీకారం



**వరంగల్ వాయిస్, గణపురం :** గణపురం మండలంలోని గాంధీనగర్ గ్రామంలో బుధవారం నూతనంగా మంజూరైన ఆర్ అండ్ బీ మెయిన్ రోడ్డు నుంచి ఫారెస్ట్ వరకు నిర్మించనున్న రహదారి పనులను సర్పంచ్ ఇంజపల్లి శ్రీనివాస్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ సుమారు 5 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ రోడ్డు పనులను గ్రామస్తుల సహకారంతో అతి త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ రహదారి అందుబాటులోకి రావడం వల్ల గ్రామంలోని పలు వాడలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని, ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాకేష్, కరోబార్ సంపత్, గ్రామ ప్రముఖులు వెంపటి భద్రయ్య, చందర్ రావు, శ్రీధర్, శ్రీనివాస్, సమ్మయ్య, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే ప్రాధాన్యం

### పెద్దంపల్లి సర్పంచ్ గడ్డే రఘు



**వరంగల్ వాయిస్, రేగొండ :** ప్రజల ఆరోగ్యం, గ్రామ సమస్యల పరిష్కారమే తమ మొదటి ప్రాధాన్యత అని రేగొండ మండలం పెద్దంపల్లి గ్రామ నూతన సర్పంచ్ గడ్డే రఘు పేర్కొన్నారు. బుధవారం సర్పంచ్ రఘు, ఉప సర్పంచ్ సకినాల రవీందర్ తో కలిసి గ్రామంలో స్వయంగా పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. గత కొన్ని రోజులుగా గ్రామంలోని వార్డుల్లో పేరుకుపోయిన చెత్తను, మురుగు కాలువల్లో నిలిచిన వ్యర్థాలను సిబ్బందితో కలిసి యుద్ధ ప్రాతిపదికన తొలగింపజేశారు. దోమలు ప్రబలకుండా, అంటువ్యాధులు సోకకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. దుకాణదారులు, ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా చెత్త బుట్టల్లో సేకరించాలి. పంచాయతీ వాహనం వచ్చినప్పుడు చెత్తను సిబ్బందికి అందజేసి గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచడంలో భాగస్వాములు కావాలి. పరిశుభ్రత అనేది కేవలం పంచాయతీ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కారోబార్, పంచాయతీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్రే కీలకం

### శంభునిపల్లి సర్పంచ్ కోమలకు సన్మానం



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడంలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు–స్వప్న దంపతులు అన్నారు. బుధవారం జమ్మికుంట మండలం శంభునిపల్లి గ్రామ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన రాసపల్లి కోమల సదానందం దంపతులను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. మడిపల్లి గ్రామానికి చెందిన అంబాల రాజు–స్వప్న దంపతులు, సర్పంచ్ నివాసానికి వెళ్లి వారిని పుష్పగుచ్ఛంతో అభినందించారు. అనంతరం శాలువతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంభునిపల్లి ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, రాబోయే ఐదేళ్లలో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్ది ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏకశిలా ప్రైమ్ లో ముందస్తు క్రిస్మస్



**వరంగల్ వాయిస్, దామెర:** మండల కేంద్రంలోని ఏకశిలా ప్రైమ్ పాఠశాలలో బుధవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు కన్నులపండువగా జరిగాయి. పాఠశాల ఆవరణలో క్రిస్మస్ ట్రీని రంగురంగుల దీపాలతో అలంకరించి, పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ వేడుకల్లో పాఠశాల డైరెక్టర్ కొండల్ రెడ్డి, ప్రిన్సిపాల్ గోకుల్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ దీప పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన శాంతాక్లాజ్ వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు.

# ఆడబిడ్డల జననాల రేటు పెంచాలి



- జిల్లా వైద్యాధికారి అల్లం అప్పయ్య
- శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ
- సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తప్పవు

**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలో పురుషుల కంటే స్త్రీల జననాల రేటు తక్కువగా ఉండటంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అల్లం అప్పయ్య ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి, సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఆడపిల్లల జననాలు పెరిగేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. గర్భిణీలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగించి, ప్రసవాలన్నీ ప్రభుత్వ వైద్యశాలల్లోనే నార్మల్ డెలివరీ అయ్యేలా చూడాలని, ఇందుకోసం గర్భిణీలను, వారి కుటుంబ సభ్యులను చైతన్యపరచాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది పనితీరును పరిశీలించిన ఆయన, సమయపాలన విషయంలో కఠినంగా ఉండాలని స్పష్టం చేశారు. విధులకు ఆలస్యంగా వచ్చే వారిపై మరియు విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వైద్యాధికారి ఈ సందర్భంగా పలు కీలక ఆరోగ్య పథకాలపై రివ్యూ నిర్వహించారు. క్షయ వ్యాధి నిర్మూలనకు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అసంక్రామ్య వ్యాధుల నియంత్రణపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. తల్లీబిడ్డల ఆరోగ్య విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఆరోగ్య విస్తరణాధికారులు, ఆశా కార్యకర్తలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# క్లెయిమ్ చేయని ఆస్తులను తిరిగి పొందండి

- కలెక్టరేట్‌లో "మీ డబ్బు, మీ హక్కు" ప్రత్యేక శిబిరం
- డిపాజిట్లు, బీమా నిధులను క్లెయిమ్ చేసుకోవాలని హక్కుదారులకు సూచన



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** పౌరులు తమకు తెలియకుండా బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల్లో ఉండిపోయిన క్లెమ్ చేయని ఆస్తులను వెలికితీసి తిరిగి పొందాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వై.వీ గణేష్ కోరారు. భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు.. "మీ డబ్బు, మీ హక్కు" అనే నినాదంతో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ప్రచారంలో భాగంగా బుధవారం హనుమకొండ కలెక్టర్ కాంప్లెక్స్ ఆడిటోరియంలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు మూడు నెలల పాటు ఈ ప్రత్యేక ప్రచారం కొనసాగుతుందని తెలిపారు. క్లెమ్ చేయని బ్యాంకు డిపాజిట్లు, వాటాలు, డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్‌లు, భీమా ఆదాయాలు ఉన్న హక్కుదారులు తగిన పత్రాలతో సంబంధిత సంస్థలను సంప్రదించి తమ నిధులను తిరిగి పొందాలని సూచించారు. లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో బ్యాంకు అధికారులు పలువురు హక్కుదారులకు క్లెమ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని తమ కష్టార్జితాన్ని దక్కించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ రీజనల్ మేనేజర్ షేక్ అబ్దుల్ రహీం, ఆర్‌బీఐ ఏజీఎం ఎం.జెడ్.రెహమాన్, ఎస్బీఐ ఎస్ఎల్బీసీ మేనేజర్ పి.కాళీ ప్రకాష్, హనుమకొండ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జన్ను మహేందర్ పాల్గొన్నారు.

# 27న వరంగల్ అభివృద్ధిలో పద్మశాలీల పాత్రపై సదస్సు

- ముఖ్య అతిథిగా ఐఏఎస్ పరికిపండ్ల నరహరి
- పద్మశాలి మేధావులు, ప్రముఖులు తరలిరావాలని పిలుపు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ నగర అభివృద్ధిలో పద్మశాలీల పాత్ర మరియు భవిష్యత్తు ప్రణాళికలపై ఈ నెల 27 సాయంత్రం 5 గంటలకు భారీ సమావేశం నిర్వహించనున్నట్లు విశ్వ పద్మశాలి సంక్షేమ సంఘం ప్రతినిధి కుసుమ సతీష్ తెలిపారు. బుధవారం వరంగల్ చౌరస్తాలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. వరంగల్ చౌరస్తాలోని కే కన్వెన్షన్ హాల్ లో జరిగే ఈ సదస్సుకు మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ, ప్రముఖ ఐఏఎస్ అధికారి డాక్టర్ పరికిపండ్ల నరహరి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా కుసుమ సతీష్ మాట్లాడుతూ.. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన వివిధ రంగాల ప్రముఖులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, రిటైర్డ్ ఉద్యోగులు , అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ ఈ సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కుల బాంధవులందరూ ఏకతాటిపైకి వచ్చి వరంగల్ ప్రగతికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రెస్ మీట్‌లో పద్మశాలి సంక్షేమ సంఘం ప్రతినిధులు తాళ్ల సమ్మన్న, బేతి అశోక్ బాబు, బైరి మురళీకృష్ణ, బాలెనే స్మరక్, చిప్ప వెంకటేశ్వర్లు, బైరి శ్యాంసుందర్, కూచన క్రాంతి కుమార్, మెరుగు అశోక్, చిలువేరు రాజేందర్, చెన్నూరి దేవేందర్, ఆడెపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారులు హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



- అదనపు కలెక్టర్ వైవీ.గణేష్
- కలెక్టరేట్‌లో ఘనంగా జాతీయ వినియోగదారుల దినోత్సవం

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** సమాజంలో వినియోగదారులు తమ హక్కుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే మోసాలకు అడ్డుకట్ట వేయగలమని హనుమకొండ జిల్లా ఇంచార్జి అదనపు కలెక్టర్ వైవీ.గణేష్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జాతీయ వినియోగదారుల దినోత్సవం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వినియోగదారులు ఎక్కువగా మోసపూరిత తూకాల వల్ల నష్టపోతున్నారని, దీనిని నివారించేందుకు తూనికలు కొలతల శాఖ నిరంతరం తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి వస్తువు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదు (బిల్లు) తీసుకోవాలని, అది ఉంటేనే మోసపోయినప్పుడు చట్టపరంగా న్యాయం జరుగుతుందని తెలిపారు. తూకాల రాళ్లకు ప్రతి సంవత్సరం తప్పనిసరిగా స్టాంపింగ్ వేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు వినియోగదారులకు అవగాహన కల్పించడంలో ప్రభుత్వ సంస్థలతో పాటు వినియోగదారుల ఫోరమ్స్ చురుగ్గా పాల్గొనాలన్నారు. జిల్లా వినియోగదారుల ఫోరం పునరుద్ధరణ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, డిజిటల్ న్యాయ వ్యవస్థ ద్వారా కేసులు వేగంగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వాజిద్ అలీ, తూనికలు కొలతల శాఖ అధికారి వెంకటేష్, రాష్ట్ర వినియోగదారుల ఫోరం అధ్యక్షులు రతన్ సింగ్ ఠాగూర్, కార్యదర్శి సూరజ్ పాల్గొన్నారు. అలాగే ఓరుగల్లు వినియోగదారుల ఫోరం సభ్యులు దండు యుగేందర్, బండ వివేకానంద, శోభ తదితరులు హాజరయ్యారు.

# పరీక్షల భయం వీడండి.. విజయం సాధించండి

## డాక్టర్ జగదీష్ బాబు

## ఎల్ బీ కాలేజీలో అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పరీక్షలంటే విద్యార్థులు భయం వీడి, పక్కా ప్రణాళికతో సిద్ధమైతే విజయం సులభమవుతుందని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ జగదీష్ బాబు అన్నారు. బుధవారం వరంగల్‌లోని లాల్ బహదూర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులకు పలు కీలక సూచనలు చేశారు. పరీక్షల సమయంలో సమయాన్ని వృధా చేయకుండా చదువుపై పూర్తి ఏకాగ్రత పెంచాలి. ఎలాంటి మానసిక ఆందోళనకు గురికాకుండా, నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం చదివితే ఆశించిన ఫలితాలు సాధించవచ్చు. చదువుకు ఆటంకం కలిగించే సోషల్ మీడియాకు ఈ సమయంలో పూర్తిగా దూరంగా ఉండాలని ఆయన హితవు పలికారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్.రావు, ఇంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజేందర్ రెడ్డి, ఇంటర్ కో–ఆర్డినేటర్ సదానందం పాల్గొన్నారు. అలాగే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రఘువెంధర్ రెడ్డి, ఉమ్మగోని శ్రీనివాస్, అధ్యాపకులు రాధిక, సుధాకర్, విద్యార్థులు హాజరయ్యారు.

# దేశ సేవలో రామప్ప విద్యార్థులు

## ఆర్మీ శిక్షణ పూర్తి చేసుకున్న జవాన్లకు సన్మానం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ ములుగు రోడ్‌లోని రామప్ప డిఫెన్స్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు దేశ రక్షణ రంగంలో తమ ప్రతిభను చాటుతున్నారు. గత ఏడాది ఆర్మీకి ఎంపికైన కళాశాల విద్యార్థులు మహేష్, దీపక్ రాజులు విజయవంతంగా మొదటి ఏడాది బేసిక్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం వారు తమ కళాశాలను సందర్శించి డైరెక్టర్, కోచ్‌ల ఆశీస్సులు తీసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహేష్, దీపక్ రాజులు తమ ఉన్నతికి కారణమైన రామప్ప కళాశాల డైరెక్టర్ ఐలి కర్ణాకర్ గౌడ్, కోచ్ కమల్లను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. క్రమశిక్షణతో కూడిన శిక్షణే తమను ఈ స్థాయికి చేర్చిందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ఐలి కర్ణాకర్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఆర్మీ, బిఎస్ఎఫ్, ఎయిర్ ఫోర్స్ వంటి డిఫెన్స్ విభాగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దడంలో రామప్ప డిఫెన్స్ జూనియర్ కళాశాల అగ్రగామిగా ఉందన్నారు. ప్రత్యేక తర్ఫీదు, నాణ్యమైన శిక్షణ ద్వారా విద్యార్థులు దేశ సేవకు అంకితమయ్యేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఆర్మీ శిక్షణ ముగించుకొని వచ్చిన రాజు, దీపక్, మహేష్‌లను పూలమాలలతో అలంకరించి విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. బాణసంచా కాల్చి, నినాదాలతో కళాశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొల్పారు. ఈ కార్యక్రమంలో కోచ్ కమల్, జోనల్ మేనేజర్ పూర్ణచందర్, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, వినోద్, అశోక్, విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రాణాలు పోతున్నా పైసలు ఇవ్వరా ?



- రిటైర్డ్ ఉద్యోగుల ఆవేదన
- ఏకశిలా పార్కు వద్ద పెన్షనర్ల జేఏసీ దీక్ష
- 20 నెలలుగా పెండింగ్‌లో రిటైర్మెంట్ బకాయిలు
- తక్షణం నిధులు విడుదల చేయాలని నిరసన

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** "మార్చి 2024 నుండి రిటైర్ అయ్యాం.. 20 నెలలు గడిచినా మా కష్టార్జితం మాకు అందడం లేదు. బకాయిలు రాక, అనారోగ్యంతో ప్రాణాలు పోతున్నా ప్రభుత్వానికి చలనం లేదా?" అంటూ రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ బకాయిల సాధన కమిటీ మరియు పెన్షనర్ల జేఏసీ పిలుపు మేరకు బుధవారం హనుమకొండ ఏకశిలా (జయశంకర్) పార్కు వద్ద ఒకరోజు నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఈ. నర్సింహారెడ్డి, అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దర్ల ధర్మేంద్ర మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14 వేల మంది ఉద్యోగులు రిటైర్మెంట్ బకాయిలు అందక దయనీయ స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు అందక, ఆర్థిక ఇబ్బందులతో కృంగిపోయి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 35 మంది పెన్షనర్లు చనిపోయారని, కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వక్తలు గుర్తు చేశారు. రిటైర్మెంట్ సొమ్ము రాకపోవడంతో పిల్లల పెళ్లిళ్లు చేయలేక, అప్పులు తీర్చలేక, కనీసం జబ్బులకు వైద్యం చేయించుకోలేక వృద్ధాప్యంలో నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి కింది బకాయిలను వెంటనే ఏకమొత్తంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ 2020 ఏరియర్స్, జీపీఎఫ్ బిల్లులు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యూటీ, కమ్యుటేషన్ నిధులు, సర్వీసులో ఉండగా చేసుకున్న సరెండర్ లీవుల నగదు విడుదల చేయాలన్నారు.ఈ దీక్షా శిబిరానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, కోల సంతోష్ రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, అలాగే టీపీటీఎఫ్, డీటీఎఫ్ సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. పెన్షనర్ల న్యాయమైన పోరాటానికి తమ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3.30 వరకు జరిగిన ఈ దీక్షలో ఎన్.డీ.మహబూబ్ అలీ, ఇంద్రసేనారెడ్డి, విశ్వనాథం, రవీందర్, రఘువీర్ పాల్గొన్నారు. జేఏసీ నాయకులు వీరయ్య, సాంబయ్య, సమ్మారెడ్డి, సూర కుమారస్వామి, సుమారు 180 మంది పెన్షనర్లు పాల్గొన్నారు.

# అడవిలో అద్భుతం..

## శరవేగంగా మేడారం అభివృద్ధి పనులు
































# దయ్యమంటే భయం లేని వాళ్లకు ఈషా చూపించండి

త్రిగుణ్, హెబ్బాపటేల్ కీలక పాత్రల్లో రానున్న హారర్ థ్రిల్లర్ 'ఈషా' . శ్రీనివాస్ మన్నె దర్శకుడు. డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. అందులో నిర్మాత బన్నీవాసు మాట్లాడుతూ ఫన్నీ కామెంట్స్ చేశారు. 'మా ఫ్రెండ్స్ బ్యాచ్‌లో తనకు దెయ్యాలంటే భయం లేదని డప్పు కొట్టేవాడు ఒకడు ఉంటాడు. అలాంటి వాళ్లను కచ్చితంగా 'ఈషా'కు తీసుకెళ్లండి. భయపడకపోతే అప్పుడు గ్రేట్' అని నవ్వులు పూయించారు.





## ఆఖరికి సావే సచ్చిపోయింది

### మైసా ఫస్ట్ గ్లింప్స్ విడుదల

నాయికా ప్రధానమైన కథలకు కేరాఫ్‌గా మారిపోతున్నారు రష్మిక. 'ది గర్ల్‌ఫ్రెండ్' తర్వాత ఆమె ప్రధాన పాత్రధారిగా తెరకెక్కుతున్న మరో చిత్రం 'మైసా'. రవీంద్ర పుల్లె దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు . బ్యాక్‌గ్రౌండ్‌లో డైలాగులతో రష్మిక పాత్రను పరిచయం చేశారు. 'నా బిడ్డ ఊపిరి మోయలేక అగ్గే బూడిదైంది. నా బిడ్డను సంపలేక.. ఆఖరికి సావే సచ్చిపోయింది' అనే డైలాగులు ఆసక్తి కలిగిస్తున్నాయి. ప్రతీకారం తీర్చుకునే 'మైసా' పాత్రలో రష్మిక నటిస్తున్నట్లు గ్లింప్స్ ఆధారంగా తెలుస్తోంది. 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రంలో అమాయకమైన యువతిగా ఆకట్టుకున్న నేషనల్ క్రష్ రష్మిక మందన్న, ఇప్పుడు తన నెక్ట్స్ మూవీ 'మైసా' కోసం వెరైటీ అవతారంలో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తాజాగా విడుదలైన యాక్షన్ గ్లింప్స్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఈ గ్లింప్స్‌లో రష్మిక కనిపించిన విధానం ఆమె కెరీర్‌లోనే తొలిసారి అని చెప్పాలి. ఒళ్లంతా రక్తం, తెగిపోయిన చేతి బేడీలు, చేతిలో గన్, కళ్లలో రగిలే కోపం? ఒక గిరిజన తిరుగుబాటు యువతిగా ఆమె ప్రెజెన్స్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇప్పటివరకు రొమాంటిక్, ఫీల్ గుడ్, కమర్షియల్ పాత్రలతో అభిమానులను మెప్పించిన రష్మిక, ఈసారి పూర్తిగా రెబల్ యాక్షన్ మోడ్‌లోకి మారిపోయింది. గ్లింప్స్‌లో వినిపించే వాయిస్ ఓవర్ పాత్రలోని గాంభీర్యాన్ని మరింత పెంచగా, సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్ అందించిన పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ యాక్షన్ సీక్వెన్స్‌లకు ప్రాణం పోసింది. ప్రతి ఫ్రేమ్‌లో ఇంటెన్సిటీ కనిపిస్తూ, 'మైసా' ఓ సాధారణ యాక్షన్ సినిమా కాదని ఈ గ్లింప్స్ స్పష్టంగా చెబుతోంది. 'మైసా' అంటే 'అమ్మ' అని అర్థం. గోండు గిరిజన తెగల నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ సినిమా, అన్యాయానికి ఎదురు నిలిచే ఓ సహజ నాయకురాలి కథగా ఉండనున్నట్లు తెలుస్తోంది. స్వేచ్ఛ, పోరాటం, భావోద్వేగాల మేళవింపుతో ఈ చిత్రాన్ని ఓ పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాగా మలుస్తున్నారు. రష్మికతో పాటు, 'పుష్ప 2'లో విలన్ పాత్రతో మెప్పించిన తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా, పలు భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా విడుదలైన యాక్షన్ గ్లింప్స్‌తోనే 'మైసా'పై అంచనాలు భారీగా పెరిగాయి. రష్మిక కెరీర్‌లోనే అత్యంత ఫెరోషియస్, ఇంటెన్స్ పాత్రగా ఇది నిలవనుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



## నేటివిటీకి దగ్గరగా దండోరా కథ

నేడు విడుదల కానున్న చిత్రం శివాజీ, నవదీప్, బిందు మాధవి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'దండోరా' మురళీకాంత్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా 25న గురువారం ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ మూవీ సెన్సార్ పూర్తి చేసుకుంది. 2.16 గంటల నిడివితో 'దండోరా' ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసిన సెన్సార్ బోర్డు చిత్ర బృందానికి 15 మార్పులు సూచించింది. ఇందులో వాడిన కొన్ని అసభ్య పదాలను కచ్చితంగా తొలగించాలని ఆదేశించింది. అలాగే సినిమా ప్రారంభంలో వాయిస్ ఓవర్‌తో ఇందులోని పాత్రలు కల్పితమని పేర్కొంటూ గమనిక ఇవ్వాలని సూచించింది. కొన్ని సన్నివేశాలను బ్లర్ చేయాలని ఆదేశించింది. విడుదల నేపథ్యంలో తాజాగా దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. మలయాళంలో ఎక్కువ కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలొస్తుంటాయి. అలా మన దగ్గర ఎందుకు రావనే ఆలోచనల్లో నుంచి ఈ కథ రాసుకున్నట్లు తెలిపారు. 'అందరూ టీజర్, పాటలు చూసి దీన్ని 'బలగం'తో పోలుస్తున్నారు. నిజానికి దానికి, దీనికి ఏ పోలిక లేదు. వ్యక్తి చనిపోయిన తర్వాత నుంచి ఆ శవాన్ని ఖననం చేసేవరకు ఈ కథ ఉంటుంది. ఆ శవాన్ని పూడ్చనీయకుండా ఓ ఊరి వాళ్లు ఎందుకు అడ్డుకున్నారు? అసలు ఆ ఊరి సమస్య ఏంటి? దానికి పరిష్కారం దొరికిందా? లేదా? అనే అంశాలతో దీన్ని రూపొందించాం' అని చెప్పారు.

## రేపు థియేటర్లలోకి ఛాంపియన్ మూవీ

నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం తెరకెక్కించిన చిత్రం 'ఛాంపియన్' గురువారం విడుదలవుతోంది. ఇప్పటికే ఇందులోని పాటలు సూపర్‌హిట్ అయ్యాయి. ఇందులోని గిరగిర పాట ఎక్కడ చూసినా మార్మోగుతోంది. దీనిపై రీల్స్ సోషల్ మీడియాను ముంచెత్తాయి.. కేరళకుట్టి అనస్వర రాజన్ హీరోయిన్. ఈ పీరియాడికల్ స్పోర్ట్స్ యాక్షన్ మూవీ క్రిస్మస్ సందర్భంగా 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా రిలీజ్ టీజర్‌ను 'సెలబ్రేషన్ ఆఫ్ ఛాంపియన్' అంటూ ఎన్టీఆర్ విడుదల చేశారు. 'ఇన్ని ఊర్లు ఉండగా.. ఈ ఊర్లోనే పడలా' అనే రోషన్ డైలాగులు ఆసక్తికరంగా ఉన్నాయి. తెలంగాణ న ఏపథ్యంలో కథను మలిచినట్లు తెలుస్తోంది. కాసర్ల శ్యామ్, చంద్రబోస్ పాటలు హైలెట్ కానున్నాయి. మిక్కి జె మేయర్ సంగీతం హత్తుకునేలా ఉంది.





# ఆలయాల జోలికొస్తే ఉరికించి కొట్టుడే

- కార్పొరేషన్ అధికారులకు గుడి అనే సోయి లేదా
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లాలో హిందువుల మనోభావాలు దెబ్బతీస్తే ఉరికించి కొడుతామని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ హెచ్చరించారు. పైడిపెల్లిలో మైసమ్మ ఆలయం కూల్చివేతపై ఆయన బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం మైసమ్మ ఆలయం ప్రదేశాన్ని పరిశీలించిన ఆయన అక్కడి గ్రామస్తులకు, స్థానిక ప్రజలకు తిరిగి గుడి నిర్మాణం చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కి వినతి పత్రం సమర్పించారు. అక్కడ జరిగిన వాస్తవాలను వివరించి గుడి కూల్చివేతపై అత్యుత్సాహం ప్రదర్శించిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా కార్పొరేషన్ నిధులతోనే ఆలయ పునఃనిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం గంట రవి కుమార్ మాట్లాడుతూ.. చారిత్రక ఓరుగల్లు నగరంలో ఎన్నో అక్రమ నిర్మాణాలు, కట్టడాలు, నాలా కబ్జాలను పట్టించుకోని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మైసమ్మ ఆలయాన్ని కూల్చడంలో మాత్రం అత్యుత్సాహాన్ని చూపించారని ఎద్దేవా చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై వారిచ్చే సొమ్ముకు ఆశపడి పోలీసుల సాయంతో గుడిని కూల్చివేశారని మండిపడ్డారు. ఆలయ నిర్మాణం రోడ్డు పక్కనే ఉన్నా.. కుడా లే ఔట్ కూడా ఉన్నా కుట్ర చేసి కూల్చారని ఫైర్ అయ్యారు. ఓరుగల్లులో ఇలా హిందువుల మనోభావాలు దెబ్బతీసే చర్యలును ఉపక్షించమన్నారు. ఒక మతాన్ని అంటిపెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఇలాంటి వాటిని ప్రోత్సహించొద్దని సూచించారు. భవిష్యత్ లో ఇలాంటి దాడులకు పాల్పడితే ఉరికించ్చి కొడుతామని గంట రవికుమార్ వార్నింగ్ ఇచ్చారు.

### మున్సిపల్ అధికారులకు సోయిలేదా..?

గ్రేటర్ పరిధిలో ఎన్నో అక్రమ నిర్మాణాలు పుట్టుకొస్తున్నా, నాలాల కబ్జాలు జరుగుతున్నా, రోడ్డును ఆక్రమించి దర్గాలు కడుతున్నా కార్పొరేషన్ అధికారులకు కనిపించడం లేదా అని గంట రవికుమార్ ప్రశ్నించారు. రోడ్డు పక్కన ఉన్న హిందూ దేవాలయాలే వారికి అక్రమ నిర్మాణాలుగా కనిపిస్తున్నాయా అంటూ ఫైర్ అయ్యారు. కార్పొరేషన్ శాఖ అధికారులంతా ఒకసారి ఆలోచన చేయాలన్నారు. మీరు హిందువులు కాదా అని ప్రశ్నించారు. మీ ఆలోచనా విధానం మార్చుకోకపోతే హిందువుల నుంచి దాడులు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హిందూ బంధువులు, బీజేపీ శ్రేణులు, పైడిపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.



# అందుబాటులో డిజిటల్ న్యాయ వ్యవస్థ

- వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం
- జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వినియోగదారులకు సులభతరమైన, సత్వరమైన న్యాయ పరిష్కారాన్ని అందించే దిశగా ప్రభుత్వాలు పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టాయని, దీనిలో భాగంగానే డిజిటల్ జస్టిస్ ద్వారా కేసుల పరిష్కారం చేపడుతున్నారని జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం వరంగల్ జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో 'డిజిటల్ న్యాయవ్యవస్థ ద్వారా వినియోగదారుల సమస్యల పరిష్కారం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివిధ వినియోగదారుల కోర్టులలో దాఖలు చేస్తున్నప్పటికీ వివిధ కారణాలతో చాలాకాలంగా పెండింగ్ లో ఉంటున్నాయన్నారు. అనవసర జాప్యం తగ్గించి సులభతరమైన విధానంలో త్వరితగతిన వినియోగదారుల సమస్యలు, కేసులు పరిష్కరించేందుకు డిజిటల్ న్యాయవ్యవస్థను తీసుకురావడం జరిగిందన్నారు . ఇందులో ఉత్పత్తులు, సేవలలో లోపాలను ఎదుర్కొన్న వారు మోసపోయిన, నష్టపోయిన వినియోగదారులు తమ ఇంటి నుంచే ఆన్లైన్లో డిజిటల్ ప్లాట్ ఫారం ద్వారా కేసు నమోదు చేయవచ్చన్నారు నోటీసులు జారీ, విచారణ ప్రక్రియ, తీర్పుల వెల్లడి అంతా కూడా ఆన్లైన్లో జరుగుతుందన్నారు దీని ద్వారా కేసుల పురోగతి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డిస్ట్రిక్ట్ మేనేజర్ సంధ్యారాణి, జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్, ఫుడ్ సేఫ్టీ అధికారి కృష్ణమూర్తి, ఉద్యానవన శాఖ, పరిశ్రమల శాఖ అధికారులు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు సత్యనారాయణ, తోట పూర్ణచందర్రావు , సారంగం, వసంత, వెంకటస్వామి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, చౌక ధరల దుకాణాల డీలర్లు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అడిషనల్ కలెక్టర్ మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.

# కొలువుదీరిన పగిడిద్దరాజు, గోవిందరాజులు

- సంప్రదాయ గిరిజన పద్దతిలో పూజలు
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క, అధికారులు

**వరంగల్ వాయిస్, ములుగు :** మేడారం మహాజాతర కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో గద్దెలపైపగిడిద్దరాజు, గోవిందరాజులు కొలువుదీరారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గోవిందరాజును బుధవారం ఉదయం 6 గంటలకు, పగిడిద్దరాజును 9.45 గంటలకు పూజారులు ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జాతర కార్యనిర్వహణాధికారి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులను గద్దెల ప్రాంగణంలోకి రానివ్వకుండా భద్రత ఏర్పాట్లు చేపట్టారు. సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులు కుటుంబాలతోపాటు హాజరై పూజా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. మేడారం జాతర వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరుగనుంది. దీనికి తెలంగాణతోపాటు చుట్టుపక్కల ఉండే రాష్ట్రాలనుంచి కోటి మందికిపైగా భక్తులు తరలి వస్తారని అంచనా. ఈ సారిగా నూతనంగా నిర్మించిన గద్దెలపై సమ్మక్క, సారలమ్మతోపాటు పగిడిద్ద రాజు, గోవిందరాజులను కొలువుదీర్చుతున్నారు. జాతర ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నారు. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుంది. దాని మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పు ప్రధాన స్వాగత తోరణం ఉంటుంది. పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలను సమ్మక్క`సారలమ్మ గద్దెలు ఉండే వరుసలోకి మార్చారు. ఈ ఏర్పాటు ద్వారా భక్తులంతా ఒక వరుసలో దర్శనానికి వెళ్లేందుకు వీలు కలుగనుంది. వృత్తాకారంలో ఉండే గద్దెల చుట్టూ ఎనిమిది స్తంభాలు ఉంటాయి. వాటి మధ్యలో వెదురు బొంగులతో డెకరేషన్ చేయనున్నారు.

# ఓసీ సింహ గర్జనను విజయవంతం చేయండి

- జేఏసీ రాష్ట్ర నాయకుల పిలుపు
- వరంగల్ లో జనవరి 11న ఏర్పాటు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జాతీయ స్థాయిలో ఓసీలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్రంలో కూడా అమలు చేయాలని ఓసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు గోపు జయపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. మొదటి నుంచి అన్ని రంగాలలో ఓసీలకు వివక్షతో జరుగుతున్న అన్యాయాలపై జనవరి 11 న వరంగల్ లో తలపెట్టిన సింహ గర్జనను విజయవంతం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలన్నారు. సింహ గర్జన కోసం ప్రతి ఓసీ బిడ్డా ఒక సైనికుడిలా పని చేయాలనీ పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఓసీ జేఏసీ కార్యాలయాన్ని సీనియర్ జర్నలిస్ట్ తుమ్మ శ్రీధర్ రెడ్డి, ఓసి జేఏసీ రాష్ట్ర నాయకులు దుబ్బ శ్రీనివాస్, రాయపాటి వెంకటేశ్వరావు సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఓసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు గోపు జయపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూ రెడ్డి, వెలమ, వైశ్య, బ్రాహ్మణ, కమ్మ, మార్వాడిలతో పాటు రిజర్వేషన్ పొందని ఇతర సామాజిక వర్గాలు అనేక సంవత్సరాల పోరాటాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం అగ్రకులాల పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించదన్నారు. అయితే ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా రెండు సంవత్సరాలు కాలాయాపన చేసిందని, అలాగే కావాలనే రిజర్వేషన్లపై కొందరు దుష్ప్రచారం చేసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓసిలంతా ఐక్యంగా ఉండి న్యాయమైన హక్కుల కోసం పోరాడవలసిన సమయం వచ్చిందన్నారు. పోరాటాల గడ్డ వరంగల్ ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్ లో జనవరి 11 న లక్ష మందితో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జేఏసీ నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఓసీ జేఏసీ రాష్ట్ర నాయకులు రాము, నడివిల్లి వెంకటేశ్వరావు, అర్జుల కిషన్ రెడ్డి, చందుపట్ల నర్సింహ రెడ్డి, దొడ్డ మోహన్ రావు, వీరారెడ్డి, సంజీవ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ లు కృష్ణ మోహన్, పెద్దిష్, బుచ్చిరెడ్డి, జేఏసీ నాయకులు తోట సురేష్, జగన్, మోహన్ శర్మ, బ్రాహ్మణ సంఘ నాయకురాలు వాణి, తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com